# ద్వేషము

*అంకితం: ప్రేమబావ సోమశేఖర శర్మకు గాఢాలింగనంతో*
*(ఈ కథా, ఈ కథలోని పాత్రలు కేవలం కల్పితాలు).*

**ఆ**వేశంలో ఆ చిత్రము లిఖిస్తున్నాడు. రంగులు కలపడంలో కుంచెలు రంగుల్లో ముంచడంలో, కుంచెలతో కాగితంమీద చిత్తరువు చిత్రించడంలో అతివేగము.

ఆ చిత్రం పేరు "రోడ్డు రోలరు". రంగులు, అంబరు, సియన్నా, పెయన్ సుగ్రే, నీలిమందు, క్రిమిసన్‌లేతు కలిసిన తపస్సును కలిగినవి.

రేఖలు అ సాధువులు, కర్కశాలు; రూపాలు వికృతాలు, భయంకరాలు.

హెచ్చు తగ్గులుగా ఉన్న రోడ్డు – ఆ రోడ్డును సమం చేయడానికి భారతీయ నరనారీమణులు, రాళ్ళు – శిశువులూ, వృద్ధులూ, వికృతాంగూలూ. ఆ రాళ్ళమీదనుంచి రోడ్డురోలరు నెమ్మదిగా, నిదానంగా అత్యధికమైన చప్పుడు చేస్తూ వెడుతున్నట్లున్నది.

ఆ రోలరు బండి నడిపేవాడు నల్లటి ఎత్తుటోపీ బ్రిటిషు రాజ్యతంత్రజ్ఞుడు. రోడ్డుకు ఈవలావలున్న భారతీయులను ఆంగ్ల యుద్ధభటులు, ఆంగ్ల వర్తకులు, ఆంగ్ల మిషనరీలు కఱ్ఱలతో రోడ్డు మీద పడేటట్టు నెట్టుతున్నారు బండి వెనక భాగం రక్తమయం.

* * * *

ఆ యువకుడు ఆ చిత్రం పూర్తిచేసి తన పేరు దానిమీద లిఖించుకొని, వెనక్కువెళ్ళి చిత్రాన్ని చూచి, కళ్ళుసన్నగిల్ల, బొమలు ముడివడ పళ్ళు పటపటమని కొరుక్కున్నాడు.

విశ్వేశ్వరావు ఆవేశహృదయుడు. చిన్నతనాన్నుంచీ అతనికి దేశభక్తి విశేషం.

గాంధీ మహాత్ముడు 1919లో అహింసా మహాయజ్ఞం– భారతమాత దాస్యశృంఖలా విమోచనార్థం ప్రారంభించిన రోజుల్లో విశ్వేశ్వరుడు పదేళ్ళ బాలుడు. అప్పటికే అతనికి తాను ఆంధ్రుణ్ణనీ, బానిస అయిన భారతీయుణ్ణనీ, గాఢభావాలు మూర్తి మూర్తంతా వ్యాపించిపోయినవి.

అతని హృదయం ఆంగ్లజాతిపై ద్వేషంతో నిండిపోయింది. అతనికి ద్వేషం మోముమీద మచ్చలా వున్నది. చిన్నబిడ్డగుణం వచ్చినప్పుడు కాల్చుగా వచ్చిన మచ్చలా వున్నది.

ఎక్కడ చూచినా ప్రత్యక్షమయ్యే దారిద్ర్యం, అనాగరకతా, ఆనారోగ్యపు పరిసరాలు తెల్లవాడు తెచ్చిపెట్టిన మహాభిక్ష అని అతని నిశ్చితాభిప్రాయం.

కర్కశ హృదయంతో, స్వలాభాపేక్షతో ఈ ఇంగ్లీషు బందిపోటు భారత జాతీయత, ఐశ్వర్యము నాగరికతా తరలించుకుపోయినట్లు అతని చిన్న హృదయానికి గోచరించింది.

పాఠశాలలు విడిచి బయటకు రావలసిందని మహాత్మాజీ ఆదేశం ఇవ్వగానే బడికి వెళ్ళనని పట్టుబట్టి రాజకీయ సభలకు పోవడం, స్వచ్ఛంద భటులతో తిరగడం ప్రారంభించాడు. గాంధీగారి బోధనలు అతని చిన్న హృదయానికి అర్థంకాలేదు. ఇంగ్లీషు వాళ్ళని దేశంలోంచి వెళ్ళగొట్టడానికి వేసిన ఎత్తు అని మాత్రం అతడు భావించుకొన్నాడు.

1922 నుంచి మళ్ళీ చదవడం ప్రారంభించాడు. 1930 కి బియ్యే పూర్తి చేశాడు.

మళ్ళీ మహాత్ముడు ఉప్పుసత్యాగ్రహం ప్రారంభించగానే, కదనరంగంలోకి దూకాడు. రెండేళ్ళు జైలు, గాంధీ - ఇర్విను ఒడంబడిక వెనక వదిలారు.

కాని అతని జీవితము జైలులో పిశాచరూపం వహించింది. జైలులో అతడు తిన్న దెబ్బలు వాతలు కట్టినవి.

విశ్వేశ్వరరావు క్రోధం మిన్ను ముట్టింది. తిన్నగా ఉత్తర హిందూస్థానం జేరుకుని, లక్నోలో ఒక వర్తకపు దొరమీద, ఆకలితో మాడుతూవున్న తోడేలులాగ విరుచుకు పడ్డాడు.

చేతిలో వున్న కత్తి యొక్క వేగం ఇంకా ఎడమవైపుకు మళ్ళింది కాని, ఆ ఆంగ్లేయుని హృదయం చిమ్మటగొట్టం అయిపోయి ఉండేది. విశ్వేశ్వర్రావుకు ఇరవై ఏళ్ళు ద్వీపాంతరవాసము వరమీయబడింది.

## 2

**అం**డమాను ద్వీపాలు చూచాడు. అనేక ఇతర జైళ్ళు చూచాడు.

గాంధీ మహాత్ముడు సత్యాగ్రహం విరమించమని ఆదేశం ఇచ్చి క్రొత్త చట్టం క్రింద కాంగ్రెసువారిని శాసనసభలకు వెళ్ళవలయునని కోరిన వెనుక, అనేక రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పాటయిన వెనక, రాజకీయ బంధితులందరూ బోనుల్లోంచి ఎండిపోయిన శివంగుల్లా వచ్చారు.

అందరూ సత్యము, అహింసలయందు తమకు నిశ్చలమైన నమ్మకం కుదిరిందని శపథంచేసే బయటకు వచ్చారు. కాని కొందరికి మాత్రం వాళ్ళ హృదయాల్లో ద్వేషం దాగేవున్నది. కొందరు దాచుకొన్నారు. ఆ దాచుకొన్న వాళ్ళల్లో విశ్వేశ్వర రావొకడు.

అనేక ఖైదులు చూచాడు. అనేక రకాల కూళ్ళు కుడిచాడు. కొరడా దెబ్బలు తిన్నాడు. అడ్డ బేడీల్లో, నిలువు బేడీల్లో, గోడకుర్చీల్లో, చీకటి కొట్లల్లో పిశాచరూపాలు దాల్చాడు. పై పెదవి పైకిపోగా, క్రింది పెదవి క్రిందికి పోగా, ముక్కుపుటాలు విస్ఫారితం కాగా, కళ్ళు కాయలు కాచిపోగా, "ఖా - ఖాం" అని బుసలు కొట్టాడు. ఉపవాసవ్రతాలు చేశాడు; బలవంతంగా ద్రవాహారం ఇచ్చారు. కొనఊపిరితోనే బయటపడుతూ ఉండేవాడు.

అతని హృదయంలో దావానలం గాంధీ మహాత్ముని చల్లని మాటలతో చల్లారలేదు; ఇంటిదగ్గర తనవాళ్ళ ప్రేమ చూపుల్లో మాయమైపోలేదు.

రైల్లో బిచ్చగాళ్ళు, ఋణవిమోచన చట్టం, గాలివాన, పొలాల వరదలు, ఎగిరిపోయిన యిళ్ళు, చచ్చిపోయిన జంతువులు, అన్నీ తెల్లని పాము ఛాయలే.

ఈ తెల్లని పాము భారతదేశం అంతా నిండింది. దానికి లక్షలు లక్షలు నాల్కలు. చిన్న పిల్లాళ్ళని రుచిగా నాకుతున్నవి. కూలీలపై ఆడుతున్నది. చదువుకొని ఉద్యోగంలేని యౌవన వయస్కులను పీల్చి పొలిపోచేస్తున్నవి.

అతని ఆస్తి పెద్దది కాకపోయినా, ఆకారం పెద్దది. అందంలేని జీవితమైనా మూర్తిమాత్రము ఆర్యజాతి రేఖలు పుణికిపుచ్చుకొన్న సౌష్ఠవం కలిగిన సౌందర్యము. కళ్ళల్లో తాలిమిలేదు; హింసాకాంతులు కృత్తికానక్షత్ర యుక్త సూర్యుని కిరణాలు తీక్షణతో కనురెప్పలమీద తాండవిస్తుంటవి.

జైలులో వున్నన్నాళ్లూ చక్కగా చదువు మాత్రం నేర్చుకున్నాడు. ఫ్రెంచి, జర్మనీ, ఇంగ్లీషు, ఉరుదూ, అరవం భాషలూ మంచినీళ్ల ప్రాయం చేసుకొన్నాడు. అనర్గళధారతో మాట్లాడుతాడు, వ్రాస్తాడు.

ఖైదునుండి రాగానే చక్కనిపిల్ల నొకదాన్ని కట్టబెడితే చెదిరిన మనసు కుదుటపడుతుందని, మంచి సమ్మందాలు రెండు మూడు తీసుకువస్తే, విశ్వేశ్వరరావు- ఇష్ ఇష్ - అన్నాడు.

## 3

అతని జన్మంతా నిండిపోయిన కోపానికి విరుగుడు కనపడటం లేదు. ఏం చెయ్యాలో అతనికి తోచటంలేదు. తనబోటి వారిని పదిమందిని కలేసి, ఒక పార్టీ చేదామనుకున్నాడు. నడపబడేవారు లేరు. నడిపే మొనగాడూ లేడు. పదిమందిలోనూ తనకున్న భావాలు గట్టిగా మాట్లాడటానికి వీలు లేదు. తెల్లవాళ్ల బానిసత్వ ప్రచారానికి గాంధీ మహాత్ముడు ప్రధాన వ్యాసం వంటివాడనుకొన్నాడు.

ఇలాంటి ఇనుము నిప్పుల విశ్వేశ్వరరావుకి ఒక్కటే నీరసగుణం వుంది. శిల్పమన్నా, చిత్రలేఖనమన్నా, సంగీతమన్నా గబగబ వెళ్ళే అడుగు ఠక్కున ఆగిపోతుంది. క్రిందికి తిరిగివున్న పెదవుల రేఖలు ఒకొక్కప్పుడు ఒకవైపునా, ఒకొక్కప్పుడు రెండు వైపులా ప్రసరించి అతని మొహాన్ని వెన్నెల చేస్తవి. వేసంకాలపు మధ్యాహ్నంనాటి అతని జీవితం మాఘపూర్ణిమనాటి నిశిరాత్రి ఔతుంది.

ఎల్లోరాలూ, అజంతాలూ చూస్తూ ఆంగ్లేయులని ద్వేషించవలసిన కాలమంతా, కళలలో మునిగి వృథాపుచ్చటం తప్పని వాదించుకుంటాడుగాని, కళల మధ్య ప్రతి హింసాత్మక కలలు బాగా కనవచ్చునీ సమాధానం చెప్పుకుంటూ దక్షిణాదినివున్న గుళ్ళూ, గోపురాలూ, శిలలూ, శిల్పాలూ, విగ్రహాలూ, వితానాలూ, చెక్కడాలూ, చిత్రలేఖనాలూ దర్శనం చేస్తూ గడుపుతున్నాడు జీవితం విశ్వేశ్వరరావు.

# 4

**బొం**బాయి పట్టణంలో అలెగ్జాండ్రా రేవులో పి అండ్ ఓ. కంపెనీ వారి క్లియోపాత్రా అనే పెద్ద ఓడ వొడ్డుకు వచ్చి చేరింది. మెట్లు దింపినారు ఓడలో నుంచి క్రిందికి మొట్టమొదట దిగినవారు పది మంది ఆంగ్ల స్త్రీలు.

హిందూదేశ విచిత్ర కళాసౌభాగ్యాన్ని దర్శించి చూరగొని పోదామని జట్టుగ వారందరూ ఈ శీతకాలంలో బొంబాయి పట్టణంలో అడుగుపెట్టారు. అందరూ ఉన్నత కుటుంబాలకు చెందినవారే! చదువుకున్న వాళ్ళు. ఇరవై ఏండ్ల దగ్గిరనుంచి ముప్ఫై ఏండ్లవరకు వున్న విలాసవంతులు! వాళ్ళు పెండ్లిండ్లు చేసికోవడం స్వాతంత్ర్యానికి భంగకరమని పూర్ణంగా నమ్మిన పూవుబోడులు.

ఈ జట్టుకు నాయకురాలు మార్గరెట్టు సల్లివాన్ ముప్ఫై ఏండ్ల పడుచు! ప్రపంచంలోకల్లా అందమైన దేశం హిందూ దేశమని ఆమె నమ్మకం. హిమాలయ పర్వతం, షాలిమార్ తోటలు. తాజమహల్, అజంతా వీని అన్నింటికి తలమాణిక్యం గాంధీ మహాత్ముడు – ఇవి చాలవా. ప్రపంచానికి ఒక దేశాన్ని నాయకమణిగ చేయటానికని ఆమె వాదన.

బొంబాయి నుంచి తిన్నగా సేవగ్రామానికి వెళ్ళి వారు గాంధీగారి ఆశ్రమానికి చేరుకున్నారు. పదిహేనురోజు లా ఆశ్రమంలో, ఆశ్రమవాసులందరితోపాటు ప్రార్థన సమయానికి ప్రార్థనకు వెళ్ళుతూ, అప్పుడప్పుడూ గాంధీ మహాత్మునితో సత్యాగ్రహం, ప్రేమ, సంతాన నిరోధం, యూదులు, ప్రపంచ యుద్ధం, భారత జాతీయత, భగవద్గీత మొదలైన విషయాలను గురించి ఆ అవతార పురుషునీ అభిప్రాయాలు చూరగొంటూ కాలం గడిపారు. "వృత్తి – ఆధారవిద్య"ను గురించి తెలుసుకున్నారు.

మగన్వాడి, నల్వాడి, విద్యా – మందిరం మొదలైన ప్రదేశాలకు తీర్థయాత్రలు సాగించి, ఆ తెల్ల స్త్రీలు గాంధీ మహాత్ముని మహత్తత్వాన్ని అర్థం చేసుకొనేందుకు ప్రయత్నం చేశారు. అక్కడున్న ఆ పదిహేను రోజులూ ఆ ఆశ్రమవాసులూ ఇతర గాంధీ శిష్యులు వాళ్ళకు చూపించిన గౌరవం, మర్యాద వాళ్ళ హృదయాలను ద్రవింపచేశాయి.

డెబ్బయ్యేళ్ళు దాటిన ఆ ముసలివాడు, బోసినవ్వుతో చిన్నబిడ్డలా వున్నవాడు, దివ్యమయిన కళాకాంతులతో అవతార పురుషుడులా తేజరిల్లేవాడు. జ్ఞానపూర్ణమయి, స్పష్టమయిన ప్రేమసుధారసాలు నిండిన వాక్కులు కలిగిన ఆ "మోహనదాసు" వాళ్ళ కళ్ళకు అపర యేసు దేవుడులాగ కనపడ్డాడు.

వాళ్ళ జట్టులో ఇరవైఒక్క ఏళ్ళు నిండిన 'మేరీ టెంపిల్' అని ఓ అమ్మాయి వుంది. ఆ అమ్మాయి బంగారు అందం పిల్ల. బంగారు జుట్టు, విశాలమైన నీలికళ్ళు, పరువం పండించుకొన్న స్నిగ్ధమయిన ఉత్తమజాతి దంతంలా వున్న ఒళ్ళు. ఆమె అందాలలో హిమనాలుకలు కరిగిపోతూవుండేవి. ఆమె పెదవుల్లో కాశ్మీరసుమవర్ణం జీరలుసాగేది. సన్నటి పొడుగాటి ముక్కు, కోలమోము గులాబిరేకుల చెవులు, ఎప్పుడూ

నవ్వుతూ, జీవితరహస్య సౌందర్యం ప్రతిఫలించే ఫాలమూ ఆమెకు దివ్యసౌందర్యం నివేదనలిచ్చినవి.

మేరీకన్య ఎదుటివాడు మాటాడుతూ వుండగానే అతనిభావం గ్రహించేది. తనకే విషయమయినా నచ్చితే దానిని గురించి మళ్ళీ తర్జనభర్జన చేసుకొనేది కాదు. ఏ కార్యమైనా, తన ఆలోచనాపథంలో మెరుములా ప్రత్యక్షమయితే, ఆ కార్యం నిర్వహించుకొనేదాక నిద్రపోయేది కాదు. అఖిల ప్రపంచ శాంతి సంఘాధ్యక్షురాలయిన మార్గరెట్టు సల్లివాన్ శిష్యురాలు మార్గరెట్టు సల్లివాన్‌కు గాంధీ మహాత్ముడు దేవుడాయెను. అందువలన గాంధీ మహాత్ముడికి చెందిన జాతిలోవున్న మనుష్యులంతా, భగవంతుని ప్రక్కనున్న దేవతలవంటివాళ్ళనే ఆమె ఉద్దేశం.

బొంబాయిలో దిగినప్పుడు, రైళ్ళల్లో ప్రయాణాలు చేస్తున్నప్పుడు, హోటల్లో భోజనాలు చేస్తున్నప్పుడు కొందరు మనుష్యులు, తమ్ము మోసం చేస్తున్నారని ఆమెకు తెలిసినప్పటికీ, తన సిద్ధాంతానికి ఏదో కొంచెం వ్యతిరేకం సంభవించిందనే భావమే కాని, భారతీయులయెడ ఆమెకున్న ప్రసన్నతా భావానికి ఈషణ్మాత్రమైనా జంకు కలుగలేదు.

భరతదేశపు ఆకాశంలోని నీలిమ 'లెసిలన్‌లజూలి' శిలకన్న ఎక్కువ కాంతివంతమైనదట; భారతదేశంలోని నదీనదాల నీరు గ్రీకు దేవతల అంబ్రోసియా (అమృతము)ట. భారతదేశంలోని పువ్వులయొక్క వాసన స్వర్గధామంలో కూడా దర్శనమవుతుందో లేదో అని ఆమె కనుమానం. రెండు చేతులూ జోడించి, ఆమె జోహారులివ్వడం నేర్చుకుంది. 'సుజలాం సుఫలాం, మలయజ శీతలాం' అని పాడుతూ పులకరించుకుపోయేది.

"జీనెట్టి మెక్డొనాల్డు" గొంతుకకు వన్నెలుదిద్దే గొంతుకతో "వైష్ణవజనతో" అని పాడుకొంటూ కళ్ళు అరమూతలు చేసుకొని వణికిపొయ్యేది. ఆంగ్ల స్త్రీలందరూ మీరాబెన్నులయితేకాని ఇంగ్లండుకు మోక్షంలేదని ఆమె నిశ్చితాభిప్రాయము.

## 5

**ఉ**దయసంధ్యానృత్య పరవశుడయిన నటేశ్వరుని పదకింకిణీరవాలు రామప్ప చెరువు చిరుకెరటాలలో లీనమైపోయినవి. లూయీబోధం, బొగైన్‌విల్లా పూలయొక్క కుంకుమ వర్ణం, తెరనుకట్టి ప్రత్యూష మంగళ గీతికారవాలను, నేపథ్య గాంధర్వ మొనరిస్తున్నది. ఉదయకాదంబినీమూర్తి యొక్క అవ్యక్తరూపాలనుంచి ఉదయనృత్యాలోకనాభిలాషులయిన దివ్యులు అనిమిషులై పొడచూపుతున్నారు. అంగహార వివిధ కరణోపేతమైన అభినయలాస్యయుక్తలై అప్సరసలు పరమ నటునకు హంగుచేస్తున్నారు. రామప్ప దేవాలయంలో ప్రత్యక్షమవుతున్న ఈ దివ్యలీలనంతా దర్శించటానికి గాఢాభిలాషలై, 'మార్గరెట్టు సల్లివాన్' జట్టువా రా తెల్ల వారకట్లకే ఆ దేవాలయానికి వేంచేశారు.

కారులు దిగడంతోనే, అందరికన్న ముందుగా పరుగెత్తుకు వెళ్ళాలని అయిదంగల్లో వంతెనదాటింది. సింహద్వారం దాటింది, మండపం చేరింది మేరీటెంపిల్. ఆ మండపం

ముందర శిల్పవైభవం చాటే స్తంభాలకు శిఖర స్వరూపాలుగా నాట్యంచేసే నల్లరాతి శిల్పకన్యకలు, ఆ శిల్పసుందరుల నాట్యభంగిమ రేఖావిలాసాలను చూసి విస్తబ్ధురాలయి పోయింది మేరీ. ఆ శిల్ప బాలలందరలో ఒక మనోహరాంగి, తన ఆనందంతో మేరీగుండెను చిదిమివేసింది. తదేక దీక్షతో అలాగే చూస్తూ ఆమె నిలబడివుంది.

తనవెనకాలేదో చప్పుడయినట్లు కాంచి, చటుక్కున వెనక్కు తిరిగింది మేరీ. విషాలు క్రక్కే చూపులతో రెప్పవాల్చకుండా, తనకేసి చూస్తున్న ఒక యువకుడు బిర్రబిగిసి నిల్చి ఉన్నాడు.

"అపశ్రుతి ఇక్కడలాగ దాపురించావేమిటి?"

తెల్లబోయి మేరీ టెంపిల్ మాటాడలేకపోయింది.

"దేశమంతా పిప్పిచేస్తూ ఎక్కడో మూల దాక్కొని వున్న ఈ కాస్త కళను కూడా నమిలివేయడానికి వచ్చిన తెల్ల రాక్షసిలాగున్నావే నీవు?"

మేరీ భయంచేత కుంచుకుపోయింది. అందమైన ఆమె పెదవులు అప్రయత్నంగా విడివడినాయి.

"నీ దేశంపోయి మమ్మల్ని అపహాస్యం చేయడానికా? మేయోపిశాచం లాగ ఇక్కడి కెందుకు వచ్చావు?" బిర్రబిగుసుకుపోయి మేరీ రాయిపడి శిలావిగ్రహంలా అయిపోయింది.

ఇంతట్లో తక్కిన జట్టువాళ్ళంతా అక్కడికి వచ్చారు. వాళ్ళందర్నీ చూస్తూ అసహ్యంచేత కనుబొమ్మలు ముడుచుకుపోగా, పై పెదవి పైకి తిరిగిపోగా ఆ యువకుడు విసవిస నడిచి చక్కాపోయాడు.

మార్గరెట్టు సల్లివాన్ మేరీనిచూసి, ఆ అబ్బాయి ఏమిటి నీతో ఇంగ్లీషులో మాట్లాడుతున్నాడని ప్రశ్నవేసింది.

ఎక్కడో నీలాకాశంలోంచి ఊడిపడిన పిడుగుదెబ్బ తిన్నదానిలా చైతన్యం తప్పివున్న మేరీ మార్గరెట్టు మాటలను వినిపించుకోలేదు. "మేరీ ప్రియా! ఏమిటే అలా చూస్తున్నావు పామును చూచి భయపడే పాశ్చాత్యునిలా?"

"తళుక్కుమని దెయ్యంలా మాయమైన ఆ కుర్రాడేమయినా అన్నాడా నిన్ను? వాడి మాటలు మాకు కొంచెం కోపంగానే వినిపించాయి" అని మేరీని వీపుతట్టుతూ మళ్ళీ పలకరించింది మార్గరెట్టు.

మూలమూలలకు చెదిరిపోయిన ధైర్యశక్తిని నెమ్మదిగా చేరదీసికొని, గుండెల్లో పదిలపర్చుకొని మేరీ వెలవెలబోయే చిరునవ్వు నవ్వింది.

"ఆ! ఆ! ఏమిటీ అన్నావు మార్జీ! అబ్బే! ఏమీలేదు! ఆ కుర్రాడు ఏమన్నాడో నాకూ వినపడలేదు. ఈ ఉదయపు చిరుచీకట్లలో ఎవరూ లేరుకదా అని నేను వస్తే ఆ అబ్బాయి కనపడ్డంచేత భయపడ్డాను. అంతే."

ఇంతట్లో హేలెన్ అనే అమ్మాయి "ఏమి అందంగా వుందే ఈ గుడి! ఏమి అందంగా చెక్కాడు నందుల్ని! ప్రతి స్తంభంపైనా తనకున్న కళంతా ధారపోసి నాట్యంచేసే ఈ స్త్రీల విగ్రహాలను చెక్కినవాడు ఎంతటి మహాశిల్పికదా!" అన్నది.

సుసి: "రాతిలో చెక్కాడా, రాతిని కరిగించి పోతపోశాడా?"

**నెల్లి:** "ఇవి రాతిబొమ్మలు కావఁ్రా - శాస్త్రజ్ఞానం అంతా కనబరచి ఇనుము కరిగించి తయారు చేసిన బొమ్మలుగాని"

**మేరీ:** "ఆ దేహరేఖలు, ఆ శరీర సౌష్టవం, ఆ విచిత్ర భంగిమ. ఆ రాతితనంలోని నలుపును మరిపింప జేస్తున్నవికదా. రక్తం పోటెత్తుకు వస్తూ, స్నిగ్ధమై, సిక్తమయిన ఆమె శరీరమే కనబడుతోంది. ఈ వేళ్ళతో ఆమెను అంటుకొంటే ఆమె ఎంత మార్దవంగా వుంటుందో!"

మేరీ అప్పుడు వెనక్కి తిరిగి చూసింది. విశ్వేశ్వరరావు దూరంగా ప్రాకారపు గోడ దగ్గర నిలబడి, వాళ్ళ సంభాషణ వింటూ తెల్లవాళ్ళమీద ద్వేషం ఒక నిముషం మాత్రం మరచిపోయి భారతీయ కళను నిర్మల హృదయంతో అభినందిస్తున్న వాళ్ళ మాటలలోని పూజ్యభావానికి సంభ్రమించిపోయాడు. మేరీవంక తదేకదీక్షతో చూస్తున్నాడు. అప్పు డాతని మోములో ఆశ్చర్యానందవర్ణాలు తప్ప, ద్వేషవైవర్ణ్యం ఏమీ గోచరించడంలేదు. ఒక చిరునవ్వు ఒక చిన్న మేఘంలోని చిరుమెరుములా కలకల మంటున్నది. ఆ సమయంలో అతన్ని మేరీ చూచింది.

పెద్దపులో, తాచుపామో, పిశాచమో అని అనుకొని భయంపడ్డ ఆ బాలిక కూడా అతనికి తెలియకుండానే, అతన్ని ఆవరించిన ఆనందజ్యోత్స్నను చూచి ఆశ్చర్య హృదయయైనది. ఆ క్షణంలో ఉన్నతరూపుడై గంభీర రేఖా సమంచితుడైన అతనిరూపం అతన్ని ఆమెకు దివ్యణ్ణిగా కనపర్చింది. సుమనస్కయైన ఆ పాశ్చాత్య బాలకు విశ్వేశ్వరుని హృదయం ప్రస్ఫుటంగా ద్యోతకమయింది. ఆమె కప్పుడు గుడిలేదు. హిందూదేశంలేదు, ఇంగ్లండు లేదు. కాలపథాలలో ఒక యెడ మధురిమలు ఆవహించిన యువతి ఆమె. దూరదూరాన ఆ మహానిర్జనస్థలంలో దివ్యుడయిన పురుషమూర్తి అతడు. ఆమె బుద్ధినుండి జాతితెరలు పటపటమని క్రిందకు జారి కూలి పడిపోయినవి.

## 6

ఇంతకుముందే ఎంత కర్కశంగా తిట్టినాడు! ఎవరితను? ఎందుకితని కోపం? ఈ దేశంలోని యువకులంతా తెల్లనివాళ్ళని చూస్తే, బ్రిటిషువారిని తలచుకుంటే, ఇంత విషపూరితమైన ద్వేషంతో చూస్తూ వుంటారా! యూదులంటే హిట్లరు కోపంవంటిదా వీరి ద్వేషం?

అతనిది ఎంత చక్కని హృదయం! మేరీ హృదయనేత్రానికి ఇంగ్లండులోని తన యువక స్నేహితులందరూ జ్ఞాపకం వచ్చారు. మనకు మల్లేవాళ్ళూ ఆంగ్లోశాగ్జనుకు చెందినవాళ్ళు. జాతులన్నిటిలోకి ఆంగ్లోశాక్జను, జర్మనీ నార్డుజాతులు ఉత్తమమైనవి. వాళ్ళ ఒళ్ళు దేవతల వళ్ళు, స్వచ్ఛమైన నిర్మలమై, సాయంకాల కుంకుమవర్ణాలు ప్రసరించిన ధవళ హేమంలా ఉన్న దేహాలు దేవతలవికాక మరెవరివి?

గుణగణాలతో ఆంగ్లోశాక్జనుజాతి ఉన్నత పథాలలో లేదా? ఆ జాతివారబద్ధాలాడరు. అన్యాయాలు చేయరు. వారి గంభీరత, రాజఠీవి, వీరత్వము సర్వకళలయందూ ఆరితేరినతనము, సర్వదేశాలను అరికట్టి నిలబెట్టిన రాజనీతి.

భారతీయులలో ఉన్న అద్భుతత్వమేమిటి? అనేక యుగాలనుంచి విచిత్రమైన గ్రంథాలు ఉద్భవింపజేశారు... వేదాంత విచారము, కవిత్వము... కాని వీరి కవిత్వం షేక్సుపియరు కవిత్వంతోటి తులతూగగలదా?... విచిత్రాతి విచిత్రమైన శిల్పం ఉంది. ఆలయనిర్మాణం వున్నది. ఈ మాత్రమూ లేకపోతే హిందూదేశంయొక్క గొప్ప ఏమిటి?

పైగా గ్రీకుశిల్పంతో రోమక చిత్రలేఖనంతో డోరిక్కు, కారిన్తియను, రోమక, గాథిక్కు నిర్మాణాలతో ఈ ఆలయాలు తులతూగగలవా?.....

పైగా వీళ్ళు రంగులవాళ్ళు; లాటినుజాతులైతేనేమి? శ్లావిర్ జాతులైతే నేమి, యూదులిజాతుల వాళ్ళయితేనేమి? మాఫీయార్లయితేనేమిటి? రంగుల వాళ్ళ కన్న ఎక్కువకాదూ? రంగులవాళ్ళు నీగ్రోలకన్న కొంచెం నయం.

"మేరీ, నీ ఆలోచనల కొకపెన్నీ యిస్తాను. ఏమిటీ ఒకటే ఆలోచన? నీ నీలం కళ్ళలో కొన్ని వందల ఆలోచనలు సుళ్ళు తిరిగిపోయినవి. నువ్వు తేరిపార చూస్తున్న ఆ కుర్రవాడు వేరేచోటుకు వెళ్ళాడు" అని మార్గరెట్ మేరీ భుజం మీద చేయివేసింది. మేరీ మొదటిమాటకే ఉలిక్కిపడింది. మార్గరెట్టు మాటలు విన్నకొద్దీ ఆమె చెంపలలోకి అరుణవర్ణాలు పోటెత్తుకువచ్చినవి. ఆమె కళ్ళల్లో సిగ్గులు అలమినవి.

**మేరీ:** మార్జీ, నేనో ప్రశ్న అడుగుతాను, నీ హృదయపూర్వకమయిన జవాబు ఇవ్వాలి.

**మార్గరెట్టు:** ఓసీ! వెఱ్ఱిపిల్లా. నే నెప్పుడయినా నా అభిప్రాయాలు దాచుకున్నట్లు నీ వెరుగుదువా?

**మేరీ:** నీ బండతనానికే నీవంటే అందరూ భయపడతారు. హైందవజాతికన్న ఆంగ్లజాతి ఉత్తమమైనదా? కాదా?

**మార్గ:** ఇదా నీ ప్రశ్న? ఇన్నేళ్ళు నా సావాసంచేసి ఇప్పుడా ఆ ప్రశ్న అడుగుతున్నావు! వారెవా! ఏవిధంగా గొప్పదంటావు? సామ్రాజ్యం స్థాపించటంలోనా, అన్యాయాలు చేయటంలోనా?

అలాగే హైందవ జాతిలో వున్న అనేకమైన లోట్లు ఆంగ్లజాతిలో లేవని చెప్పవచ్చునా కాదా?

**మేరీ:** ఒక జాతికి, ఇంకొక జాతికీ అనేక విషయాలలో తేడాలుంటాయంటావా లేదా? ఆ తేడాలలో ఒకజాతి ఎక్కువ, ఒకజాతి తక్కువా అవుతుందా లేదా?

**మార్గ:** జాతికి జాతికి తేడాలుండవచ్చు. ఆ తేడాలలో హెచ్చులూ తగ్గులూ ఉండవచ్చు. అంతమాత్రంచేత ఒక జాతి గొప్పది. ఒకజాతి హీనమయినది ఒకజాతి ఎక్కువది అనేది మాత్రం నేను ఈషణ్మాత్రమూ నమ్మను. అలా నమ్మేవాళ్ళను చూస్తే నాకు సంపూర్ణమయిన విచారం అని మాత్రం చెప్పగలను.

వారంతా అక్కడనుంచి లేచి, పాడుపడిపోయిన ఆ రంగమంటపంలోకి వెళ్ళారు. అక్కడ ఒక స్తంభంలో చెక్కిన దివ్య నటరాజమూర్తి విగ్రహాని కెదురుగుండా కూర్చుని, ఆ బొమ్మ యొక్క ప్రతిరూపాన్ని చిన్న చిత్రలేఖన పుస్తకంలో వ్రాసుకుంటూ ఆ యువకుడు వాళ్ళకు మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు. ఆ విగ్రహం యొక్క అద్భుత సౌందర్యానికి ఆ కుఱ్ఱవాని

దీక్షకు ఏదో పరమశ్రుతి వాళ్ళకు గోచరించింది. ఆ నృత్యంలో ఉండే విచిత్ర భావం ఎవరు తమకు చెప్పగలరు.

ఒక్క అయిదు నిముషములు వాళ్ళు నిశ్శబ్దంగా ఈ దృశ్యంచూస్తూ నిలబడ్డారు. పదిమందీ పదిస్థలాలకు, అప్పుడే కాలిజోళ్ళు టక్కుటక్కున చప్పుడుచేసుకుంటూ, వివిధ విగ్రహాలు ద్వారబంధము, వితాన శిల్పము, నందిని, ఏనుగులను తిలకిస్తూ చెదిరిపోయినారు.

అతిసన్నని గొంతుకలతో శిల్పాన్ని గురించి వ్యాఖ్యానాలు సాగించడం మొదలుపెట్టారు. చప్పున విశ్వేశ్వరరావు లేచాడు. అతని కళ్ళు విస్ఫులింగాలు రాలుస్తున్నవి.

“హిందువుల పవిత్రమయిన దేవాలయాలన్న కూడా మీకు ఈషణ్మాత్రం గౌరవంలేదే? నంగనాచుల్లా కాలిజోళ్ళు తొడుక్కోని అపశ్రుతి శబ్దాలు మారుమ్రోగిస్తూ ఈ దేవాలయం అపవిత్రం చేశారే. ఈ పవిత్ర శిలానృత్యమూర్తి సన్నిధానాన్ని శిల్పసత్యానికై అన్వేషిస్తున్న ఓ మనుష్యుని పట్ల అయినా మీకు దయ అన్నా లేదే. మీ ఆ యెత్తుమడమల కింద ఎంతకాలం వరకూ భారతీయ హృదయాలు చిమ్మట గొట్టాలులా రక్తాలు చిమ్ముతూ వుండగా నలిపి నలిపి తొక్కగలరు?” అని గుప్పిడి చూపిస్తూ “మీ ఆఖరి దినాలు వచ్చాయి. ఏ పూంజీవాదాల వాళ్ళయినా ఇంగ్లీషు వాళ్ళకు మెలిమొగుళ్ళు హిట్లరు, ముస్సోలినీ – వాళ్ళ కడుపులు చల్లగా ఆంగ్ల జాతి, ఈ శతాబ్దాల పాపపు మంటల్లోపడి భగ్నమయిపోయే.......

మార్గరెట్టు – చిరునవ్వుతో – “ఏమయ్యా! క్షమించు. ఇది పాడు దేవాలయముకదా! అని జోళ్ళు తొడుక్కువచ్చాం. పాడుదేవాలయం అయితే మాత్రం, ఇది పవిత్రమైన శిల్పదేవాలయం. జోళ్ళు విడిచి రావలసిందే. ఈ శిల్పానికి మేము కొత్తవాళ్ళ మవడంచేత అర్థంచేసుకోవడానికని మాట్లాడుకున్నాము. మనస్ఫూర్తిగా మా అందరి తరఫున మిమ్మల్ని క్షమాపణ వేడుతున్నాను. మీ బొమ్మ అయినదాకా పైనే తిరిగివస్తాము” అని చిరునవ్వు నవ్వుతూ తన జట్టు యావన్మందితోను రండని సైగచేసి, వాళ్ళతో పైకి పోయింది.

ఖస్ ఖస్సని బుసలుకొడుతూ మాట్లాడిన విశ్వేశ్వరరావు విభ్రాంతి పొంది, తనది జయమో అపజయమో నిర్ణయించుకోలేకపోయాడు. అందాలు పుణికిపుచ్చుకున్న ఆ శ్వేతజాతి బాలిక చిరునవ్వు నవ్వుతూ తనవైపుకు వారచూపులు ప్రసరింపజేసి వెళ్ళిపోయినది.

ఎంత అందంగా వున్నది! శ్వేతజాతుల్లో అందమైన వాళ్ళుంటారా? దేహ సౌష్ఠవంలో భారత నారీమణులు ప్రపంచంలోని తక్కిన స్త్రీలకన్న అందమయినవాళ్ళు కారా? ఒకవేళ బాహ్యసౌందర్యంలో కొందరు పాశ్చాత్య జాతుల స్త్రీలు హైందవ నారీమణులతో సమానమైనా హెచ్చయినా, అంత సౌందర్యంలో వాళ్ళు ఎట్లా పోలగలరు? కాని ఆ అమ్మాయి ఏవో శిల్ప సౌందర్యాలను సేకరించుకొన్నది.

అయినా వీళ్ళ సంగతి? విశ్వేశ్వరరావు గబగబ రెండంగల్లో వేరే పక్కనవున్న దేవాలయంలోని శిల్పం చూస్తూవున్న ఆ యువతీ మండలి దగ్గరకుపోయి వాళ్ళకు

జోహారించి, "నన్ను మీరంతా క్షమించాలి, ఈ శిల్పాలను గురించి నే నంతా చెప్పడానికి మీరు ఆజ్ఞయిస్తే, మీరు నన్ను క్షమించినట్లు ఎంచుకొంటాను" అని పలికినాడు.

మార్గరెట్టు నవ్వుతూ 'అలాగే రండి. కొంచెం చెప్పండి: మా కృతజ్ఞత అందుకోండి" అన్నది.

ప్రతి శిల్పం దగ్గరికీ వాళ్ళను తీసుకువెళ్ళి దానిని గూర్చి విశ్వేశ్వరరావు చక్కని భాషలో గంభీరమయిన భావంతో విపులంగా చెప్పాడు. కొద్ది వాక్యాలలో భారతీయ శిల్ప లక్షణాలను గురించి వాళ్ళకు బోధపరచాడు. భారతీయ శిల్పానికీ పాశ్చాత్య శిల్పానికీ ఉండే తేడాలు అనర్గళంగా ఉపన్యసించాడు.

"ఇక్కడ నుంచి మీరు ఎక్కడికి వెడతారు?" అని ప్రశ్నించాడతను.

**మేరీ:** గాంధీ మహాత్ముని ఆశ్రమంలో పదిహేను రోజులున్నాము. వార్ధా వెళ్ళి అజంతా, ఎల్లోరా, ఎల్ఫెంటాలు మాత్రమే చూశాము. అక్కడ నుంచి తిన్నగా హనుమకొండ, ఓరుగల్లు చూసి ఇక్కడికి వచ్చాము. హిందూదేశము యావత్తూ చూడాలని సంకల్పం ఉంది.

**విశ్వే:** అట్లయితే ఇక్కడినుండి అమరావతి, నాగార్జునకొండ చూసుకొని, అక్కడినుంచి హంపి, బిజాపూరు, బాదామి, హర్పనహాళ్ళి యాత్రలు సేవించుకొని; పెనుగొండ, తాడిపత్రి, లేపాక్షి వెళ్ళి మైసూరులో హళేబిదు, బేలూరు, శ్రవణ బేళగొళా యాత్రలు సేవింపవచ్చు. నేనున్నూ లేపాక్షివరకూ మీతో వస్తాను – మీకు నేరావడం ఆక్షేపణ లేకపోతే.

## 7

**వా**ళ్ళతో మైసూరుదాకా యాత్రలు సాగించాడు. విశ్వేశ్వరరావు. ఎక్కడో అణిగివున్న అతనిలోని మర్యాదంతా ఉబికివచ్చింది. మార్గరెట్టుకు విశ్వేశ్వరరావుకు అహింస, జాతిభేదాలు, కళలు, సాహిత్యమూ మొదలయిన విషయాల్ని గురించి వాదాలు జరుగుతూ వుండేవి. విశ్వేశ్వరరావు  కోపం విపరీత రూపం తాల్చేది. అతడు మేరీ అందం చూచి భరించలేకపోయేవాడు.

అతనిలోని క్రూరత్వము లోలోన గాలివాన రేగింది. మింగబోయే కప్పను పాము వెంబడించినట్టు వాళ్ళతో కూడా అతడు ప్రయాణాలు చేసినాడు.

వాదనలోని కరకుతనమూ, విజ్ఞానమూ అతనిలో వెలుగు నీడలు అయ్యాయి. ప్రతి వాదన విషయములోనూ అతని ద్వేషం ఉడుకెత్తుకొని ఉబుకెత్తుకొని, పరవళ్ళు తొక్కుతూ ప్రవహించింది. అది 'గ్రైసరు'లా వేడినీటి ఊటలా ఆకసం అంటేటట్లు గబుక్కున వస్తూవుండేది.

అతనికున్న అపారజ్ఞానం ఆ పాశ్చాత్య స్త్రీలను ఆశ్చర్యంలో ముంచింది. అతని ద్వేషానికి వాళ్ళలో కొందరు ఒణికిపోయారు. ప్రతి భారతీయ యువకుడు ఇల్లాగే ఆంగ్లేయులను ద్వేషిస్తున్నాడా?

నెల్లీ మార్గరెట్టుతో అనేకసార్లు "ఎందుకీ రాక్షసుణ్ణి కూడా తిప్పుకోవడం" అని కోపంతో వాదించింది. మేరీతప్ప తక్కినవాళ్ళు ఆమె వాదాన్ని బలపరచారు. కాని మార్గరెట్టు చిరునవ్వు నవ్వుతూ –

"నా ప్రియబాలికల్లారా! నాకు పాలంపేట గుళ్ళో ఒకదీక్ష అంతరాత్మలోంచి ఉద్భవించింది. రెండు రాత్రిళ్ళు ప్రార్థనతో ఆ భావము సత్యమైందా? కాదా? అని భగవంతుని ప్రశ్నించుకున్నాను. ఈ విషయం యావత్తూ గాంధీ మహాత్మునకు వ్రాసుకున్నాను. ఆయన జవాబు – నన్నాశీర్వదిస్తూ – రానివ్వండి! ఈ బాలకుడు మనల్ని చంపుతాడా? చంపనీ! ఈలాంటివాళ్ళ ద్వేషానికి మనం ఆహుతికావడం ఎంత విచిత్రమైన పవిత్రమైన దానము. ప్రేమతో బలిదానం ఈ ఉద్యమాన్ని అరికట్టదా?" అని అరమూతలైన చూపులతో దివ్యహాస నృత్తాలైన పెదవులతో పలికింది. వెంటనే మేరీ ఆమెను గాఢంగా కౌగిలించుకుంది.

"ప్రియా! నాకున్న అనుమానాలు పటాపంచలు చేశావు. ఈ రాత్రి ఒక రహస్యం నీతో చెప్పి, నా హృదయతాపం ఉపశమనం చేసుకుంటాను" అని అన్నది.

తక్కిన వాళ్ళంతా, "ఏమిటి మేరీ! గాంధీగారు రహస్యాలు ఉండకూడదన్నారు కదా?" అని ఒత్తిడి చేశారు. చిరునవ్వు నవ్వుతూ మేరీ, "తొందరపడకూడదు. స్పష్టత పొందని ఆలోచనలు అప్పుడే వ్యక్తం చేయలేను. అది సరికాదూ? మార్గీ!" అని మార్గరెట్టువైపు చూసింది. నవ్వుతూ "అలాగే మేరీ"! అంది ఆమె.

అందరూ నవ్వుతూ ప్రయాణం అయ్యారు. విశ్వేశ్వరరావు వాళ్ళ దగ్గిర సెలవు తీసుకొని గబుక్కున మద్రాసు తిరిగి వచ్చాడు.

దారిపొడుగునా మేరీ కన్యామూర్తే అతని యెదుట మేఘ శకలంలా గోచరిస్తున్నది. పువ్వుని కమ్మిన నల్లని తుమ్మెదలా అతని ద్వేషం చుట్టూ జుమ్మని తిరగడం ప్రారంభించింది. అతని హృదయం పుష్పం మధ్యన అల్లరి చేయకుండా, తేనెలు తాగుతూ, దాగుకుంటూ, ఏదో ఒక భావం, ఏదో ఒక కోర్కె, ఏదో ఒక అనుభూతి!

మేరీ మాటలు, మేరీ పాటలూ, మేరీ నడక, మేరీ వాదన, మేరీ శిల్ప హృదయం... ఆమె భారతీయ శిల్ప దేవాలయం యొక్క ప్రథమ ప్రాంగణంలోకి ప్రవేశించింది.

"ఎందుకు ఈ దేవాలయానికే ఆమె రావాలి? ఆమె నా హీన పాశ్చాత్య శిల్పశిథిలత్వంలోనే పొర్లాడనీ, ఎవరామె భారతీయ మహాశిల్ప సత్యాన్ని గోచరింప చేసుకునే అధికారం సంపాదించడానికి?

"పోనీ, ఈ నీచ స్త్రీలను తన దేశం వదలనీ! వాళ్ళతో పాటు తమ దేశ సౌభాగ్యం తమకే ఉండనీ! దేశంలోని సువర్ణ రాసులు, దేశంయొక్క మహాసౌభాగ్యమైన అభిమానమూ, మానమూ, స్వేచ్ఛా తస్కరించుకుపోయింది. పోక, ఈ కజిన్సులు, ఈ హావేల్సులు, ఈ క్రాసురెస్టులూ, ఈ క్రూల్డేలు, ఈ గిల్లులు, ఈ మేరీలు మా శిల్పంకూడా తస్కరించుకు పోవాలీ?

అతని కళ్ళు విషవాయువులు వీచే నాభీసుమాలయ్యాయి. అతని పెదవులు పళ్ళల్లో, ఎలుకబోనులా బిగుసుకుపోయ్యాయి.

ముష్టిపట్టి అతను బల్లను గట్టిగా గుద్దినాడు. వాళ్ళతో ఉన్నప్పుడు తనకింత పిరికితన మెందుకో? వాళ్ళను బాధపెట్టలేకపోయినాడు. వాళ్ళకు అంత సేవ చేయడమేమిటి తాను? వాళ్ళ సేవకుడిలా టిక్కట్టుకొన్నాడు. బళ్ళు మాట్లాడాడు. కూడా వెళ్ళి ప్రతి శిల్పంయొక్క అర్థమూ, అందమూ, ఆనందమూ వర్ణించి చెప్పాడే, ఎంత చచ్చు హృదయం అయిపోయింది!

మేరీకన్య తన్ను మంత్రంవేసినట్లు తిప్పిందే! తియ్యటి గొంతుకతో కబుర్లు చెబుతోంటే, ఏదో మమతతో కాంక్షతో గాఢ సంతోషంతో విన్నాడు కబుర్లు....

ఇప్పటికే ఆ రోజున జరిగిన ఒక విషయం ఒల్లు జల్లు - జల్లు మనిపిస్తోందే. ఆ రోజున తాను లేపాక్షి చిత్రలేఖనం, శిల్పం అంత మాధుర్యంగా వర్ణిస్తూ, వాళ్ళందరికీ హృదయాలు ఉప్పొంగచేసిన మాట నిజం. ఆ రాత్రి వెన్నెట్లో లేపాక్షి బసవయ్యను తిలకిస్తూంటే తన కళ్ళు చమరించినమాట నిజం. ఆ ఉన్నత ఉత్తమ శిల్పం ప్రక్క తాను ఒక శిల్పంలా అయిపోయిన మాట నిజం కాని... తన వెనకనే... వచ్చి... ఆ మేరీ కన్య... తన రెండు భుజాలమీద చేతులువేసి... 'వెన్నెట్లో శివునిలా నిలబడ్డావు - పార్వతికోసమా విశ్వేశ్వర్?' అని ప్రశ్నవేస్తూ నా వీపున... ఆమె హృదయం తాళగతులు లయింపగా, అని..ఒక నిమిషం... ఒకే నిమిషం...పక్కకు వచ్చి నిలుచున్నది... తనకు కలిగిన పులకరాలు, ఒళ్ళు వేడి, హృదయంలో మత్తు...ఏమో ఏమో... అతి - అతి భావాలు! వీళ్ళు సైరను తియ్యని పాటలతో మోహంపెట్టి, తమ మంత్రములో పడవేసుకొని, రక్తం పీల్చే గ్రీకు ఢాకినీ వనితలా?

ఆ మేరీ! - ఏమి ఆమె అందం... ఎందుకు వాళ్ళని తిట్టుకోడం. "ఓయి వెఱ్ఱిమొగపు విశ్వేశ్వరరావూ! నువ్వు వట్టి వాజమ్మవు. నీ అగ్ని చల్లారింది. నీ హృదయం చచ్చింది. నీ అభిమానం అధోగతిపాలయింది. నీ దేశభక్తి కుళ్ళిపోయింది. లే....ఏడు, నెత్తి నోరూ బాదుకొని, గాజులు తొడిగించుకొని, వంట చెయ్యి జజ్జమ్మా, చచ్చుమ్మా."

## 8

"మేరీ, చిన్న ఫోటో బాగా తీశావే! ఏమిటీ అతిగా పరికిస్తున్నావు ఆ విశ్వేశ్వరరావు బొమ్మను?" అని నెల్లీ మేరీని పలకరించింది.

వాళ్ళంతా మధుర దేవాలయం చూస్తున్నారు. తిరుమలనాయకుని మహాభవనం చూశారు. మండపం చూశారు. తెప్పాకులం చూశారు. మేల గోపురాలు పరిశీలించారు.

మీనాక్షి గుడియెదుట ఉండేలోని మండపంలోని విగ్రహాలని సందర్శిస్తున్నారు. తిరిగి తిరిగి నృత్యమూర్తి అయిన శారదాదేవి విగ్రహం కడకువచ్చారు. ఆ విగ్రహం యొక్క చిత్రం ఓటి - విశ్వేశ్వరరావు - చక్కని రేఖా చిత్రంగా తన స్కెచ్చి పుస్తకంలో వ్రాసుకొని ఉన్నాడు. ఆ రేఖా చిత్రం చాలా అందంగా చిత్రించినాడు. "ఆ చిత్రం అందరితోబాటు తనూ, ఈ విగ్రహంచూస్తే జ్ఞాపకంరాగా అతనికి తెలియకుండా నేను తీసిన అతని ఛాయారూపం చూస్తున్నాను నెల్లీ!" అన్నది మేరీ. నెల్లీ పకపక నవ్వింది.

"ఓసి నంగనాచీ! నా దగ్గిర దాపరికం వద్దు. థియసాఫిస్టులలా భారతీయులంటే ప్రేమించడం నేర్చుకున్నావేమిటి?" అన్నది.

"నీ మాటలు విపరీతంగా వున్నాయి నెల్లీ!"

"నిన్ను నేను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాను. ఒకటిలే. నువ్వు ఇదివరకే, ఎందరి యువకులతోనో జాగ్రత్తగా మాత్రం సరదాగా గడిపావు. ఒకళ్ళిద్దర్ని ప్రేమించానను కొన్నావు. అల్లాగేనా ఈ విశ్వేశ్వరరావు వెఱ్ఱినీ?"

"నెల్లీ! నీకు ఈ జన్మలో వేళాకోళం గుణంపోయేది ఎప్పుడే!"

తిరిగి వాళ్ళంతా రహదారి బంగళాకు జేరుకున్నారు.

నెల్లీ మళ్ళా మేరీని ఒంటరిగా కలుసుకొని, "మేరీ! నువ్వు మార్జీతో ఏమి మాట్లాడింది నాకు తెలియజేయకపోయినా, నేను ఊహించుకోలేకపోలేదు. మార్జీ జాతికీ జాతికీ ఎంత తేడాలేదని వాదించినా, ఒక పథంలోంచి ఆ వాదన నేను ఒప్పుకున్నా, స్త్రీ–పురుష సంబంధ విషయంలో నువ్వు కోటి వాదనలు తీసికొనిరా, మీరు నన్ను ఒప్పించలేరు" అని తీవ్రముగా వాదించింది.

"ఇప్పుడు నీ సలహా అవసరమే మొచ్చింది నెల్లీ? నువ్వు కాదూ కూడదూ వాదిస్తాను అంటావూ? అయితే నీ వాదన నీకే అప్పజెప్పుతాను. సాధారణ హీన విషయాలలో జాతి తేడాకు నాకు అభ్యంతరం లేదుగాని, ఉత్తమమైన కళల విషయంలో, స్త్రీ పురుష సంబంధం విషయంలో, భగవంతుని విషయంలో, జాతిమత భేదాలు ఎంత మాత్రమూ ఉండకూడదని నా గట్టి వాదన. అంతే అంటుంది మార్జీ. అదికాకుండా నే నొక రహస్యం మార్జీతో మాట్లాడనన్నావు. అది ఏమిటో విను; విశ్వేశ్వరరావు వెఱ్ఱిగా దేశభక్తి అని అనుకుని, అతి ద్వేష హృదయంకలవాడై ఉన్నాడు.

మహాత్ముని ఆదేశ ప్రకారం, ఆ యువకుడికి మనం అహింసామహావ్రత దీక్ష ఇవ్వాలి అని మార్జీతో చెప్పితే, ఆమె ఎంతో సంతోషంతో సెహబాస్ అన్నది. అది ఈ నాటి సంగతి, నీకు తృప్తి అయిందా?"

"ఏమి చేశారు మీరు? అతడు మరికాస్త ద్వేషంతో మండిపోయాడు. మీరు వాడి దారిని వాణ్ణిపోనీక గాంధీ అంతవాడు చేయలేని పిచ్చి పిచ్చి పనులు చేయబోయి, పీకల మీదకు తెచ్చుకుంటారు."

## 9

**మ**ధురనుంచి యాత్రలు సాగించుకొంటూ వారు చెన్న పట్టణం చేరుకున్నారు. అక్కడ మైలాపూరు కపాలేశ్వరాలయాల్ని చూచారు. ఆ దేవాలయంలో విశ్వేశ్వరరావు వీళ్ళకు ఎదుర్కోలు ఇచ్చాడు. నెల్లీ మేరీని చూచి పరిహాసంగా చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వు విశ్వేశ్వరరావు చూచాడు. దాని భావమూ గ్రహించాడు. మనసులో ఉగ్రుడైపోయాడు.

విశ్వేశ్వరరావును చూడగానే మేరీ గుండె కొట్టుకున్నది. మార్గరెట్టు ఆనందంతో విశ్వేశ్వరరావును బహూకరించి, తమతో రమ్మని ఆహ్వానించింది.

ఆ గుడి చూస్తున్నంత సేపూ విశ్వేశ్వరరావుకూ మార్గరెట్టుకు భారతీయ జీవితాన్ని గురించి వాదోపవాదాలు పెరిగాయి.

భారతీయులు అఖండ ప్రయత్నంచేసి శుభ్రజీవితం అలవాటు చేసుకోకపోతే ఈ ఉత్కృష్ట జాతి అంతా నశించిపోతుంది అని మార్గరెట్టు.

ఈ హీన స్థితికి కారణం ఆంగ్లేయులే అనిన్నీ, దేశాన్ని పీల్చి పిప్పి చేస్తే ఈలాంటి జీవితం తమకు వచ్చిందనీ అతని వాదన.

అక్కణ్ణుంచి అందరూ కలిసి 'కానమోరా' హోటలుకు వెళ్ళారు. అందరూ తమ గదులకు దుస్తులు మార్చుకొనేందుకు పోయారు. హోటలు హాలులో మార్గరెట్టా, విశ్వేశ్వరరావూ వాదించుకుంటూ కూచున్నారు.

"మీరు హిందూదేశ క్షేమమే నిజంగా కోరేవారైతే అందుకొరకే లండనులో "భారతీయ సంపూర్ణ స్వరాజ్య సమితి ప్రారంభించి పనిచేస్తున్న వారయితే, మీ వాళ్ళంతా సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్ళేందుకు ఎందుకు ప్రయత్నం చేయరు?"

"ఏమండీ!! అందరూ ఒక్క ఉద్దేశం కలవాళ్లవుతారా? మా దేశం మొత్తంమీద ఏ వేయిమందో, ఈ తక్షణమే భరతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలనేవాళ్ళు ఉన్నారు. పదివేలమంది ఏ కొద్ది సంవత్సరాలల్లోనో యివ్వవచ్చుననేవాళ్ళు ఉన్నారు. అసలు ఎప్పటికీ ఇవ్వరాదనే వాళ్ళు కోట్లు."

"అందుకనే దెబ్బకు దేవేంద్రలోకం అన్నట్లు, భరతదేశపు ముష్టియొక్క బరువూ బలమూ చూపిస్తేనే మీ వాళ్ళు లొంగుతారని మా నమ్మకం."

"అలాటివాళ్ళు ఏ లక్షో రెండు లక్షలోగా వుండేది".

"తక్కిన వాళ్ళంతా, భరతదేశం బ్రతికి ఉన్నన్నాళ్లూ ఆంగ్లేయ పాదధూళి శిరస్సున ధరించే బ్రతకాలి అని నమ్మేవాళ్ళనా మీఉద్ధేశం?"

"అది కాదయ్యా, అహింసా ధర్మం వల్ల సంపూర్ణ స్వరాజ్యం స్థాపించాలి అని నమ్మేవారు."

"అయితే ఏవి వారి పనులు, వారి ఫలసిద్ధి?"

"నమ్మకానికి, నమ్మడానికి తగినట్లు జీవితాన్ని అనుసరించేటట్లు చేయగల శక్తి ఉండడానికి ఎంతో దూరం వుంది. ఆ దూరం క్షణక్షణమూ మహాత్ముని నాయకత్వం క్రింద తగ్గించుకుంటున్నారు. భారతీయ ప్రజాలోకము."

"ఓహోహో! ఇది మాకు ఒక ఆంగ్ల స్త్రీ బోధించడం!"

"హేళన ఎందుకు వీర పురుషుడుగారూ! నా జీవిత సర్వస్వములో నమ్మిన విషయం అది. అది నా బోధకాదు, మహాత్ముని నేను అర్థంచేసుకున్న రీతి అది."

ఆమె మాటలలోని నిర్మలత్వమూ, ఆమె కళ్ళల్లోని నిశ్చలత్వమూ, ఆమె దరహాసంలోని కరుణామయత్వమూ అతనికి సిగ్గు పుట్టించాయి.

"క్షమించండి మార్గరెట్టుగారూ? నాలోని ఆవేశంచేత అన్న మాటలు అవి. మీ నిష్కల్మష హృదయము నాకు సంపూర్ణముగా ద్యోతకము అయింది. అహింసవల్ల లోకంలో శాంతి అవతరిస్తుందని అనుకోవడం శుద్ధ వెఱ్ఱి అని నా నమ్మకం. అహింసాతత్వార్థమూ,

దాని తర్కమూ, జ్ఞానమూ నాకే మాత్రమూ హృదయానికి తట్టలేదు. ద్వంద్వాతీతుడయిన భగవంతునికి ద్వంద్వాలు ఉండుంటాయని నమ్మకంకదా! అల్లాంటప్పుడు భగవంతుడు అహింసా స్వరూపుడని వాదించడం ఏమిటి?"

"అదికాదయ్యా! భగవంతుడు ద్వంద్వాతీతుడనే శ్రీ మహాత్మాజీ కూడా చెప్పేవి. స్థిత ప్రజ్ఞుడైనవాడూ, భగవంతునిలో లీనమైనవాడూ అయిన వాడు సిద్ధుడు, సాధకుడు ప్రపంచంలో ఉన్నవాడు.

ప్రపంచంలో ఉన్న వాళ్ళకు ద్వంద్వాలలో ఒకటి మంచిది ఒకటి చెడుగు-వెలుగు మంచిది చీకటి బాధ-ఆ వెలుగు యొక్క తత్వం ప్రేమ, విశ్వేశ్వరరావు గారూ!...."

"ఈ సిద్ధాంతాలన్నీ విన్నాను, నాకు నవ్వు వస్తుంది - అందులో మా వేదాంతాలలో పుట్టి పెరగని మీరు ఎల్లా తెలుసుకోగలరు?"

"ఇదివరదాకా పంటకు లేని భూములు, ఎరువువేసి దున్నితే, ఎలాంటి పంట వేసినా, అద్భుతంగా పండవటయ్యా?"

అక్కణ్ణుంచి విశ్వేశ్వరరావు విడిదికి చక్కాపోయాడు.

## 10

**వాళ్ళ**తో ఆంధ్రదేశం అంతా తిరిగి తన ఊరు కూడా వాళ్ళను తీసికొని వెళ్ళినాడు విశ్వేశ్వరుడు.

ద్వేషము అనుకుంటూనే అతడు వాళ్ళకిచ్చిన సత్కారమూ, ఆతిథ్యమూ వర్ణనాతీతమైనాయి. విశ్వేశ్వరరావు తల్లితో వాళ్ళు ఎంతో ప్రేమతో వ్యవహరించారు. విశ్వేశ్వరరావు తల్లి వాళ్ళను హృదయానికద్దుకుంది.

ఆమె సత్సంగంలో చేరడంవల్ల తన పూర్వాచార పరాయణత్వాన్ని దయాల్బాగు పవిత్ర భూములలో ప్రేమ గురునకే సమర్పించిన మనిషి. సర్వదా భజనాధ్యానములలో భగవంతుని అర్చించే భక్తురాలు.

ఆమెకు ఈ ఆంగ్ల స్త్రీలు తన యింటికి రావడం పరమ సంతోషమైనది. ఆమెను ఆ ఆంగ్లవనితా సమూహము హృదయమార ప్రేమించినది.

మేరీటెంపిల్ ఆమెతో విశ్వేశ్వరరావును దగ్గర ఉంచుకొని, అతడు భాషాంతరీకరణం చేస్తూండగా, విశ్వేశ్వరరావు బాల్యచరిత్రం అంతా అడిగి తెలుసుకొంది. విశ్వేశ్వరుని జైలు కష్టాలు, అతని సహజ ప్రేమ హృదయము, అతడు ఎల్లప్పుడూ ఏదో రూపంగా దీనజనులకు చేసే సేవా, ఇంకా ఎన్నెన్నో తెలుసుకుంది. తాను భారతీయ జీవనంలోని అద్భుతఘట్టాలు దర్శించిన చిత్రాలు ఆమెకు చూపించింది. చిన్న నాటి ఫోటోలు రెండు ఆమె అడిగి తీసుకుని దాచుకుంది. అతని ప్రతిరూపాలు అతని వివిధ భంగిమలతో అతని వివిధ కళలలో చిత్రించుకున్నది. ఆ బొమ్మలు ఎవ్వరికీ చూపించలేదు.

* * * *

ఆంధ్రదేశమంతా తిరిగి వాళ్ళు భువనేశ్వరము చేరుకున్నారు. భువనేశ్వరములో విశ్వేశ్వరుడు తాను చిత్రించిన "జగన్నాథ రథము" అను చిత్రమును ఆంగ్ల స్త్రీ మండలానికి చూపించాడు.

వాళ్ళు ఆ బొమ్మని చూచి భయపడిపోయారు. వాళ్ళు అతని హృదయంలో ఎంత ద్వేషము, ఎంత క్రోధము, ఎంత హింస గూడుకట్టుకుని పేరుకు పోయినదో చూసి గజగజలాడారు. మేరీ టెంపిల్ కళ్ళవెంట బొటబొట పదహారు చుక్కలు రాలినవి. ఆమె అన్నది. "మమ్మల్నెంత ద్వేషిస్తున్నావు విశ్వేశ్వర్!" అని....

ఆ ముక్కలకు విశ్వేశ్వరుడు ఎంతో సిగ్గుపడిపోయాడు, కుంగిపోయాడు: ఆ సిగ్గుతో దహించుకుపోయాడు; ఆమె కంట నీరు సుడులుబోయి, ఆ బిందువులు అమృతపు చినుకులై అతని హృదయాన్ని దహించివేసినవి.

అమృతమే కాలకూటమైనది. వాళ్ళ ఎదుట నిలువున కుంగిపోయిన మోముతో కాళరాత్రులు కమ్మిన కళ్ళతో భయంకరదోషి ననుకుంటూ, విశ్వేశ్వరుడు దహించుకుపోయాడు...

ఎవ్వరూ మాట్లాడలేదు. గబగబ మేరీ గదిలోనికి పారిపోయింది. చురచుర విశ్వేశ్వరరావును అతి కోపంతో చూచి, నెల్లీ ఆ బాలిక వెనకాలే వెళ్ళబోతే మార్గరెట్టు ఆమెను కనుసన్నలతో ఆపుచేసింది.

చేతులు కట్టుకొని తూలుతూ విశ్వేశ్వరుడు తన బసకు వెళ్ళిపోయాడు...

అతనిలో గాలిదుమారాలు రేగాయి.

ఆ దుమారాలను అణచివేస్తూ ఆమె కంటి బిందువుల జడి గాలివాన అయ్యింది.

ఆ సాయంత్రందాకా విశ్వేశ్వరుడు తిండి తినకుండా తన బసలోనే పండుకొని ఉన్నాడు. అతని చుట్టూ చీకట్లు అలుముకొన్నాయి. అతనిలో చీకట్లు గడ్డకట్టుకుపోయినవి. అతని రక్త ప్రవాహం పూర్తిగా ఆగిపోయినట్లయింది.

ఆ సాయంకాలపు ధూప్ చాంహాలో మెల్లగా అడుగులువేస్తూ ఒంటరిగా విశ్వేశ్వరరావు తలవాల్చికొని, పరశురామేశ్వర దేవాలయానికిపోయి వెలుగు వెనక నీడరూపం (సిల్ హౌటీ) గా కనపడే ఆ గుడిని చూస్తూ చూచీచూడని చూపులతో చతికిలబడి ఉన్నాడు.

ఇంతలో చీకటి ఎక్కువౌతూవున్న ఆ సంధ్యలో అతని భుజంమీద ఒక చల్లని హస్తం–ఆ హస్తము ఒకపావురము ఒక బురుజుమీద వాలినట్లువాలింది.

అతని ఒళ్ళు మరుపులలో తూలింది. అతడు జలదరించిపోయాడు. అతని హృదయం కరడు తనలోంచి కరిగిపోయింది.

అతడు నెమ్మదిగా వెనక్కు తిరిగాడు. అతని వెనక మెరిసిపోయే నక్షత్రాల్లాంటి కళ్ళతో తన్ను కలకలచూపులు చూస్తూ మేరీ టెంపిల్ కూచుని వుంది.

ఏదో మత్తు విడిచినవానిలా చటుక్కున విశ్వేశ్వరుడు ఆమె వైపుకు మరలి ఆమె రెండుచేతులూ తన చేతులతో అదిమిపట్టుకుని–

"మేరీ! మేరీ! నువ్వు నా జీవితంలోకి ఎందుకు ప్రత్యక్షమయ్యావు? నా ప్రేమ విశ్వాసాలను పొర్లి, శూన్యాలు ఆక్రమిస్తూంది..... నన్ను నువ్వు ప్రేమించగలవా?" అని ఆమె ఎదుట తలవంచినాడు. అతని ప్రేమకు ఆమె కరిగిపోయింది.

"ఎందుకు ప్రేమించలేను?"

"నిజంగా. నిజంగా!!!"

ఆమెను అతివేగంతో తన కౌగిలిలోకి లాక్కున్నాడు.

ఆమె అతని కౌగిలింతలో వివశయైపోయినది. ఆమె అతని మోమును అగాధ ప్రేమతో చూచినది.

అత డామె పెదవులనుండి దివ్యమైన, నిర్మలమైన, దీర్ఘమైన ముద్దుకొన్నాడు.

ఆమె కనకాంబర కాంతిరూపమైన, గంధరాజపుష్ప పరీమళాత్మకమైన వేదనాతీతమైన, మహాపవిత్రమైన ముద్దునాతనికి వరమిచ్చినది......

"ఆ నృత్యమూర్తికడ క్రోధమూర్తివైన నిన్ను చూసినప్పుడే నా మనస్సు, నా ప్రాణము నీకు అంజలిఘటించాయి భారతీయుడా!"

"ఇది నిజమా మేరీబాలికా! నా దివ్యరాజ్ఞీ! ఆంగ్లేయ యువతి ఈ దీనుణ్ణి ప్రేమించడం అసంభవం కాదూ? నేనిది మహాస్వప్నం అనుకుంటున్నాను."

"నా రాజూ! నా ప్రాచ్యపతీ! నీ హేళన నిన్నింకా వదల లేదూ?"

"హేళన కాదు మేరీ ప్రియతమా! ఈ పరమేశ్వరుణ్ణి, ఈ ప్రథమ రాత్రి క్షణాల్ని అడుగు....అడుగూ!".

* * * *

ఆ రాత్రి బంగళాలో మార్గరెట్టు వరండాలో పడక కుర్చీ మీద కూర్చుని నెహ్రూ జీవిత చరిత్ర చదువుకుంటున్నప్పుడు మేరీ నడుము చుట్టూ విశ్వేశ్వరుడు చేతిని చుట్టినీ, విశ్వేశ్వరుని భుజంమీద మేరీ తలవాల్చినీ, మార్గరెట్టు యెదుటకు వచ్చి, ఆమె పాదాలకడ ఆ ప్రేమికులు మోకరిల్లారు.

మార్గరెట్టు చటుక్కున నుంచొని దివ్యానందము మోమున నృత్యం చేస్తుండ, కళ్ళు పవిత్రకాంతులు ప్రసరిస్తూ ఉండగా "నా హృదయంలోని కోర్కె ఈడేరింది నా బిడ్డలారా!" అంటూ వాళ్ళిద్దరి తలలమీద రెండు చేతులూ వేసింది....

## 11

**ఈ** వార్తవిని నెల్లి భూమిమీద ఫట్ ఫట్టని చప్పుడవుతూ ఉండగా జోళ్ళపాదాలతో గబగబ, ధడధడ, అతి కోపంగా బాదింది.

"నేను ఒప్పుకోను. ఈ వ్యవహారాన్ని పళ్ళతో గోళ్ళతో పీకి చీల్చి చెండాడుతాను. ఈ సంయోగం కానివ్వను. మేరీ గార్డియనుకు ఉత్తరం వ్రాస్తాను. కోర్టుల్లో దెబ్బలాడుతాను. ఆంగ్ల ప్రభుత్వానికి విజ్ఞప్తి పెట్టి అడ్డగిస్తాను. సిగ్గు! సిగ్గు!" అని అల్లరిచేసింది. ఘొల్లున ఏడ్చింది. పక్కమీదపడి దొర్లింది!.

మార్గరెట్టు ఆమెను చూచి, ఆమె పక్కనే మంచంమీద కూచుని, ఆమెను తన కౌగిలిలోనికి తీసికొని గట్టిగా హృదయాని కదుముకొని, ప్రేమార్ద్ర కంఠంతో, "నెల్లీ! నీకు హిస్టీరియా వస్తోంది. నీవు ఇంత అల్లరిచేయడానికి బదులు ఆనందంతో ఉప్పొంగి పోవలసింది – ఇటువంటి సంవిధానం సంభవించినందుకు! వందలకొద్ది సంవత్సరాలు! భారతీయ జాతీయతను, ఐశ్వర్యాన్ని పీల్చి పిప్పిచేసిన మనం ఇలాంటి నివేదనలతోకాని నిష్కల్మష చరిత్రులము కాలేము" అని అన్నది.

నెల్లీ రౌద్రంతో లేచి నుంచుని, "నీ వెర్రి మొర్రి మాటలు ఇక చాలించు. నీ శుద్ధ తెలివితక్కువ తనంచేత ఈలాంటి దుష్ట సందర్భం దాపురించింది. నీవు వట్టి మెదడులేని మూర్ఖురాలవు. ఈ మేరీ అమాయకురాలు. బడాయికోరున్ను! సర్వ ప్రపంచానికి నాయకమైన ఆంగ్లజాతికి తీరని కళంకము, అవమానము తెచ్చిపెడుతున్నారు. మేరీ! నీ దివ్యమైన సంపూర్ణమయిన అందమైన దేహాన్ని, నీ గౌరవాన్ని నాశనంచేసే కుళ్ళులో కూరుతావా? గాఢమైన పశుత్వం ఉందేమో, నీలో ఎక్కడో! నీలాంటి పశువులయిన మన జాతికి చెందిన అమెరికా స్త్రీలు కొందరు నల్లటి నీగ్రో వెధవలకు సమస్తార్పణలూ చేస్తారు" అని ఆడు పెద్దపులిలా గాండ్రించిపోయింది.

ఆ మర్నాడు ఆ జట్టును వదలిపెట్టి నెల్లి తన సామానుతో బొంబాయి చేరినది. ఆ వెనుకనే బయలుదేరు స్టీమరుమీద ఇంగ్లండు వెళ్ళిపోయింది.

తక్కినవాళ్ళంతా మేరీని కౌగలించుకొని "నీవు ఆదర్శవంతమైన బాలికవు తల్లీ! భగవంతుడు నీ నూతన తపస్సును సర్వసుఖప్రదంగా ఆశీర్వదించుగాక!" అని ఆమె మూర్ధము మూర్కొన్నారు.

## 12

**"మా**ర్జీ! ఇంగ్లీషు భార్యతో కాపరం చేయడానికి తగిన ధనంలేదు. సంపాదించే మార్గాలూ లేవు."

"ఓయి వెర్రివాడా! మేము భారతీయ స్త్రీల మవుతున్నాము. నీలో ఐక్యమయిపోయే మేరీ నీకు ఎలా అందం చేస్తుందో చూస్తూవుండు. ఆమెకు సాలుకు మూడువేల పౌనులు రాబడివచ్చే ఆస్తి ఉంది. అది ఆమె స్వంతం. తక్కిన ఆస్తి తనకు అక్కరలేదంటుందట!".

"నేను సాలుకు వేయిరూపాయలు మాత్రమే తెచ్చుకోగలను. ఆమె సాలుకు నలభైవేల రూపాయలు తెస్తే ఎలాగు? దరిద్రునకు వివాహం ధర్మమా మార్జీ!"

"ఓయి వెర్రివాడా! ప్రేమ ప్రధానం, ధనంకాదు. నువ్వు అహింసా వ్రతాచరణము చేయడమే పదివేలు. ఇన్ని శతాబ్దాలనుంచి దోచుకున్న ధనం మేము మీకు ఎన్ని రకాలుగా తిరిగి ఇవ్వాలో!"

విశ్వేశ్వరుని ప్రేమ మహాకావ్యమై లోకమోహనమయింది.

ఆంగ్ల యువతులు ఆంగ్ల యువకులకడనుండి, ప్రేమను ఈ అద్భుత స్వరూపంతో చూరగొనియుండరు.

ఆమెని ఒక రోజున పద్మాలు చెక్కిన పీఠంమీద అధివసింపజేసి, పదివేల పూవులతో పూజించినాడు విశ్వేశ్వరుడు.

అందాలు పుణికి పుచ్చుకున్న చీరలు ఖరీదుకలవి కొని తెచ్చి, ఆమెను ధరింపజేసి ఆమెకడ మోకరిల్లాడు.

అతని కళ్ళలోని పూజ, ఉదయ సూర్యుని వర్ణాలులా అలిమివేసినది.

"నీ సౌష్టవమూర్తిత్వానికి కాదు. నీ స్నిగ్ధబాలికాత్వానికి కాదు, నీ హిమచ్ఛ శరీర కాంతికి కాదు, నీ ఆంగ్లోశాక్షను జాతిత్వానికి కాదు. నీ దివ్య సౌందర్యానికి కాదు, మేరీ! నిన్ను నేను పూజించేది. నువ్వు నా దేవివి! నా మోక్షానివి!! నా నిత్యవు!!!

"నిన్ను ముద్దుపెట్టుకొని నీకు నల్ల తనము ఇస్తానేమోనన్న భయం...

"నువ్వు కలగా మాయం కావుకదా? నువ్వు సూర్యుని కుమారితవు కావుకదా?

"ఇన్నాళ్ళు ఈ ద్వేషం నా హృదయంలో వున్నందుకు ఫలితానివా? నన్ను ద్వేషరహితుణ్ణి చేయడానికి వేంచేసిన దివ్యసాన్నిధ్యానివా?"

అతడు పట్టుశాలీ పొందూరు ధోవతి ధరించి, పొందూరులాల్చీ ధరించి ఆమె కడకు వచ్చినప్పుడల్లా, ఈమె చిన్న పరుగుతో వచ్చి అతన్ని కంఠము బిగియారగా బాహులతలు చుట్టివేసేది.

అతని విశాల ఫాలంలో వేదబుక్కులు పనసలు పాడుతున్నవని ఆమె అనుకొనేది.

అతని కళ్ళల్లో పరమ శ్రమణకుడైన బుద్ధభగవానుని శాంతకాంతులు పుంజీభూతాలయి దర్శనమిస్తున్నవని ఆమె వణికిపొయ్యేది.

అతని మూర్తిలో గ్రీకుదేవుడు. అపోలో ప్రతి ఫలించలేదు. సర్వ సౌందర్య రూపాలు ప్రోగుచేసుకొన్న భారతీయ దివ్యమూర్తి ప్రత్యక్షమయ్యేవాడు.

"మీ భరతదేశానికి నేను నూతన యాత్రికురాలిని విశ్వా! నా చేయి పట్టుకుని ఈ దివ్య జోత్స్న లో నడిపించుకుపో" అని ఆమె అన్నది.

వారిద్దరూ ఒంటిగా ఉన్నంతసేపూ ఆమె అతని ఒళ్ళో ఉండవలసినదే! వారి హృదయాలు రెండూ లయలు, శృతులు కావలసిందే.

## 13

**మే**రీ తక్కిన వారితో ఇంగ్లండు వెళ్ళి తన వ్యాపారాలన్నీ సర్దుకొని తిరిగివచ్చేటట్లూ, అంతవరకూ విశ్వేశ్వరుడు సేవగ్రామ ఆశ్రమంలో వుండేటట్లూ ఏర్పాటు చేసుకొన్నారు.

మేరీ, మార్గరెట్టు మొదలయినవాళ్ళతో బొంబాయి వెళ్ళిపోయింది. ఒంటిగా ప్రాణ మే లోకానికే పోయిన వానిలా ఉస్సురంటూ ఆశ్రమంలో ఉన్నాడు విశ్వేశ్వరుడు.

అతి వేగంగా అతి సున్నితంగా యిరువదినాలుగు రకాల దారం వడకడం నేర్చుకోవడం ప్రారంభించాడు.

అతి బాధతో ఇంకో చిత్రం ప్రారంభించాడతడు. ఉజ్వల రూపమై జగత్కల్యాణ మూర్తియైన, శాంతి దేవి యొక్క చిత్రము. సర్వకష్టాల అతీతయైన సర్వదేషాతీతయైన పరమ ప్రేమమూర్తి! ద్వేషపూర్ణమైన ఈ ప్రపంచంలో ఒక్కొక్క విషయంలో ఒక్కొక్క దివ్య

విధానాన్ని, అహింసా స్వరూపమును నిర్ణయించుకుంటూ, ప్రేమావతారుడైన గాంధీ అహింసా మార్గమును అన్వేషిస్తున్నాడు. ఆ మహాభావాన్ని సర్వవిధాలా ఉద్దీపింపజేయడం తన బోటివారి ముఖ్యధర్మము.

ఆ చిత్రం విచిత్ర వేగంతో విజృంభింపసాగింది. నీలాలు, వంగపండు ఛాయలు పాటలవర్ణాలు.

అయిదవ రోజున సాయంత్రం ఒంటిగా ఆశ్రమానికి అనతి దూరంలో వున్న ఎత్తు ప్రదేశంమీద కూర్చుని విశ్వేశ్వరుడు మేరీ దివ్యమూర్తిని ఊహించుకుంటూ పులకిత దేహుడౌతూ, ఈ రెండు నెలలూ ఎట్లా భరించడమా అని ఆలోచించుకుంటూ, పరవశమైన స్వప్నాలు కంటూ ఉన్నాడు.

దశమినాటి చంద్రుడప్పుడే నీలాకాశంలో పైననే ఉన్నాడు. చంద్రకాంతులూ, సంధ్యాకాంతులూ వియ్యమందుతూ వున్నవి.

చటుక్కున చంద్రకిరణాల్లాంటి రెండు చేతులు అతని మెడను చుట్టుకొన్నవి. అతడు గుండె కొట్టుకొంటూ వెనక్కు తిరిగాడు "మేరీ, కలా?"

"కలకాదు. నేను నిజాన్ని ప్రియా! నిన్ను వదలి ఇంగ్లండు వెళ్ళలేకపోయాను.రెండు నెలలయిన వెనుక మార్జీ నా వ్యాపారాలన్నీ సర్ది మన... మన... వివాహానికి వస్తుందట."

"ఓహో మేరీ! నీ ఇంత ప్రేమకు నే నెట్లా తగుదును దేవీ!" వెన్నెల వెలుగు దీప్తి దాల్చినది. ఆశ్రమంలో అందరూ ప్రార్థనకు జేరినారు.